సాక్షి నంద్యాల

శనివారం ; 5 ; ఆగస్టు ; 2023



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోప చార పూజలు చేపట్టారు.



నిలకడగా ఇన్‌ఫ్లో

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలకడగా 69 వేల క్యూసెక్కులు కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం సమయానికి డ్యాంలో 85 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన విన్నకోట సూర్యశంకర శ్రీనివాస్ దంపతులు రూ.1,05,000 విరాళాన్ని అందించారు.

న్యూస్‌రీల్

శారీరక దృఢత్వం తప్పనిసరి



డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాలటౌన్: పోలీసు సిబ్బంది శారీరకంగా దృఢంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా సాయుధ బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన పెరేడ్ (స్కాడ్ డ్రిల్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నిర్వహించే స్కాడ్ డ్రిల్ క్రమశిక్షణతో కూడుకున్నదని, సమష్టిగా డ్రిల్ చేయడం వలన క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అలాగే యోగా, ఫిజికల్ ట్రెనింగ్‌లతో శరీరం దృఢంగా ఉండి తద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం..

నంద్యాల పట్టణం టెక్కె ఏరియాలో అగ్నిమాపక శాఖ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ఏపీ స్టేట్ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్ కుమార్, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రమాద సమయంలో వారు అందించే సహాయ కార్యక్రమాల డెమో నిర్వహించారు.

వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు

నంద్యాల(న్యూటౌన్): వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారి నుంచి వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్యశిక్షకుడు రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరానికి అవార్డుల ప్రదానానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్ క్రీడలు తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సొసైటీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమ ప్రతిభను ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఈనెల 25 లోగా incentivs.schemes@gmail.comకు పంపాలన్నారు.

కౌలుకార్డుల దరఖాస్తుకు నేడు ఆఖరు

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా కౌలు కార్డుల నమోదుకు శనివారం చివరి రోజు అని ఇన్‌చార్జ్ ఏడీఏ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా మండలాల్లో పొలాలను కౌలుకు తీసుకున్న కౌలుదారులు స్థానిక వీఆర్వో వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు స్థానిక ఆర్బీకేలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహానంది అభివృద్ధికి దాతల సహకారం



దివీస్ సంస్థ విరాళంగా ఇచ్చిన వస్తువులను చూపుతున్న ఈఓ, చైర్మన్

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో ఉందని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబోరేటరీస్ కంపెనీ వారు శుక్రవారం రూ. 6.20 లక్షల విలువైన రిఫ్రిజరేటర్లు, సింకులు విరాళంగా అందించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఆలయంలో ఇప్పటికే దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మరింత మంది దాతల సహకారంతో భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేలమ్మ దీవిస్తే పసుపు పసిడే!

- జిల్లాలో ఏటా పెరుగుతున్న పసుపు సాగు విస్తీర్ణం
- ఊతమిస్తున్న వైఎస్సార్ పంటల బీమా
- రెండేళ్ల నుంచి భరోసా నింపుతున్న మద్దతు ధర
- అందుబాటులో కొనుగోలు కేంద్రాలతో మరింత ధీమా
- ఇప్పటి వరకు సుమారు 2,540 ఎకరాల్లో సాగు

కర్మభూమిగా పేరున్న భారత ఉప ఉప ఖండంలో పసుపును ఎంతో పవిత్రంగా భావిస్తారు. శుభకార్యాల నుంచి పూజల వరకు అన్నింటా పసుపును ప్రత్యేకంగా వినియోగిస్తారు. చిన్న వ్యాధులు, రుగ్మతలు వచ్చినా వెంటనే పసుపుతో నయం అవుతుందని నమ్మకం ప్రజల్లో ఉంది. మరి అలాంటి పసుపు పంటను పండించే రైతులు ఎంతో నియమనిష్టలతో ఉంటారు. సంప్రదాయ పద్ధతులు, జాగ్రత్తలు పాటిస్తారు. స్నానం చేశాకే పసుపు పొలంలోకి వెళ్తారు. చెప్పులు కూడా చేను గట్టుపైనే వదిలి వెళ్తారు. లక్ష్మీదేవి అమ్మవారు స్వరూపంగా భావించే పసుపు పంట సాగు విస్తీర్ణం జిల్లాలో ఏటా పెరుగుతోంది.

ఆళ్లగడ్డ: పసుపు సాగుకు జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. వాతావరణం అనుకూలించడం, రెండు సంవత్సరాల నుంచి దిగుబడి ఆశాజనకంగా ఉండటం.. మార్కెటింగ్‌కు ఇబ్బంది లేకుండా అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కావడంతో రైతులు ధీమాగా సాగు చేస్తున్నారు. కచ్చితమైన రాబడి ఉండటం, ఓ వైపు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తుండటం, మరో వైపు వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తింప చేయడంతో ఎట్టి పరస్థితుల్లోనూ నష్టం వచ్చే అవకాశం లేదు. దీంతో రైతులు పచ్చ బంగారం (పసుపు) విత్తనం పనుల్లో నిమగ్నమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్లలో పరిధిలోనే పసుపు అత్యధికంగా సాగు అవుతోంది. ఇందులో ఆళ్లగడ్డ డివిజన్‌దే అగ్రస్థానం. గత పదేళ్ల క్రితం వరకు వేల హెక్టార్లలో విస్తీర్ణంలో సాగు చేసే పసుపు క్రమేపీ తగ్గతూ వచ్చింది. కాగా 2020 - 21లో 1,454 ఎకరాల్లో సాగు కాగా 2021 - 22లో 1,247 ఎకరాల్లో సాగు చేశారు. 2021తో పోల్చితే ఈ విస్తీర్ణం 207 ఎకరాలు తగ్గింది. ఆ ఏడాది పంట చేతికి వచ్చే సరికి ప్రకృతి వైపరీత్యాలతో అనుకున్నంత దిగుబడి రాలేదు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు దిగాలు పడ్డారు. అయితే మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లాలో మొట్టమొదటి సారిగా ఆళ్లగడ్డ, నంద్యాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో 2022-23లో 2,450 మంది రైతులు 1,713 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ఇది 2021 -22తో పోల్చితే 466 ఎకరాల్లో విస్తీర్ణం పెరిగింది. వాతావరణం అనుకూలించడం, ప్రకృతి సహకరించడంతో దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. అయితే పంట చేతికొచ్చిన వెంటనే దళారులు అంతా ఒక్కటై ధరను కట్టడి చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వం వెంటనే జిల్లాలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర క్వింటా రూ.6,850 కొనుగోలు చేయడంతో రైతులు ఊరట చెందారు.



నాగులవరం సమీపంలో సాగు చేసిన పసుపు పంట

అంచనాకు మించి సాగుకు అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులకు భరోసా కల్పిస్తుండటంతో జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ క్రమంలో 2023 - 24లో 2,935 ఎకరాల్లో సాగు చేస్తారని ఉద్యాన శాఖ అధికారులు అంచనా చేశారు. వారు అనుకున్నట్లే ఇప్పటి వరకు జిల్లాలో 2,540 ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. దీంతో ఈ నెల 15వ తేదీ వరకు సీజన్ ఉండటంతో అంచనాకు మించి మరో 600 ఎకరాల వరకు సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే పసుపు పంట పచ్చ బంగారమై మెరిసి రైతులు లాభాలు మూటకట్టుకోవచ్చు.



రుద్రవరం సమీపంలో పసుపు విత్తనం వేస్తున్న దృశ్యం

మండలాల వారీగా పసుపు సాగు వివరాలు (ఎకరాల్లో)..		
మండలం	సాధారణ సాగు	ఇప్పటి వరకు
మహానంది	923	784.55
చాగలమర్రి	437	393.82
రుద్రవరం	455	395.85
ఆళ్లగడ్డ	236	200.6
శిరివెళ్ల	78	59.5
పాములపాడు	389	334.54
నంద్యాల	172	153.08
కొలిమిగుండ్ల	68	60.52
పాణ్యం	65	57.02
వెలుగోడు	63	55.40
ఇతర మండలాల్లో	49	44.10

విత్తన పసుపునకు డిమాండ్

పసుపు సాగుకు అవసరమైన విత్తనాన్ని రైతులు ఇప్పటికే తమ వ్యవసాయ క్షేత్రాల్లో భద్రపరుచుకున్నారు. గత నెల 15వ తేదీ వరకు విత్తనం పసుపు పుట్టి (225 కిలోలు) రూ.2,500 నుంచి రూ.3,000 మధ్యన నడుస్తుండేది. అయితే తర్వాత నుంచి పుట్టి పసుపు ప్రైవేటు మార్కెట్‌లో క్వింటా ధర రూ.11 వేల వరకు అమాంతం పెరగడంతో విత్తన పసుపునకు డిమాండ్ బాగా వచ్చింది. ఎకరాకు ఐదు నుంచి ఆరు పుట్ల వరకు విత్తనం అవసరము అవుతుంది. విత్తనం సమకూర్చుకుని సాగు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. కౌలు రైతులు ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వరకు కౌలు చెల్లించే ప్రాతిపదికన ఒప్పందాలు చేసుకుని సాగుకు ఉపక్రమిస్తున్నారు.

“ ప్రభుత్వ భరోసాతో మళ్లీ సాగు చేశా



మా తాతల కాలం నుంచి పసుపు సాగు చేసే వాళ్లు. గత కొన్ని సంవత్సరాలుగా పంట గిట్టుబాటుకాక, అప్పటి ప్రభుత్వాలు పసుపు రైతు సమస్యలను పట్టించుకోక పోవడంతో సాగు చేయడం మానుకున్నాం. రెండేళ్ల నుంచి ఆళ్లగడ్డలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తుండటంతో గత సంవత్సరం 1.5 ఎకరాల్లో సాగు చేశా. దిగుబడి బాగానే వచ్చింది. అయితే ధర రూ.4 వేలే అనడంతో భయం వేసింది. అంతలో ప్రభుత్వం రూ. 6,850 మద్దతు ధర ప్రకటించడంతో మంచి ఆదాయమే వచ్చింది. అందుకే ప్రభుత్వంపై నమ్మకంతో ఈ ఏడాది మళ్లీ పసుపు వేశా.

– యాతం రాజశేఖర్, రైతు, ఆలమూరు

బీమా, మద్దతు ధర కలసివచ్చింది



పసుపును లక్ష్మీదేవి అమ్మవారిగా భావిస్తాం. ఈ పంట పొలంలో ఉంటేనే మిగతా వ్యవసాయం కలిసి వస్తుందనేది మా నమ్మకం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి పసుపు సాగు చేయని ఏడాది లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో దిగుబడులు సక్రమంగా రాక పోవడం, దిగుబడి వస్తే ధర లేక పోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిస్తూ వచ్చాం. అయితే కనీసం 0.25 ఎకరాల్లోనైనా పసుపు సాగు చేస్తూ వస్తున్నాం. ప్రభుత్వం ఉచితంగా పంటల బీమా అందజేస్తుండటంతో పా టు మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండటంతో గత సంవత్సరం 2 ఎకరాల్లో సాగు చేసిన నేను ఈ ఏడాది 5 ఎకరాల్లో సాగు చేశాను.

– విజయప్రసాద్, రైతు, మర్రిపల్లె

జాగ్రత్తలు పాటించాలి



పసుపు సాగులో మూస పద్ధతి వద్దు. అవగాహనతో కూడిన సాగు విధానాలు చేపట్టడం ఉత్తమం. సాగు విషయంలో మెరుగైన సమాచారం అందించడానికి ఉద్యాన శాఖ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారు. ఈ ఏడాది 2,935 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేశాం. ఇప్పటికే 85 శాతం పైగా సాగు పూర్తయింది.

– నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

సీమలో ఉత్తమ బ్యాంక్‌గా కేడీసీసీబీ



సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రాయలసీమ జిల్లాల్లోనే ఉత్తమ బ్యాంకుగా వరుసగా మూడో సారి అవార్డు అందుకుంది. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన ఆప్కాబ్ వజ్రోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయమనోహరి మాట్లాడుతూ.. రూ.1.50 లక్షల నగదు అవార్డుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని సీఎం చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. డీసీసీబీకి 2021-22లో రూ.3 కోట్లు నికరలాభాలు రాగా.. 2022-23లో రూ.5 కోట్లు వచ్చాయని, వ్యాపారం రూ.2,800 కోట్ల నుంచి రూ.3500 కోట్లకు పెరిగిందన్నారు. బ్రాంచి సగటు వ్యాపారం రూ.120 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పెంచినట్లు తెలిపారు. 2023-24లో బ్యాంకు టర్నోవర్ రూ.4,500 కోట్లకు తీసుకెళ్లి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. రైతులు, కౌలుదారులు ఇతర అన్ని వర్గాల వారికి డీసీసీబీ ఆర్థిక తోడ్పాటు ఇస్తోందన్నారు. ఆప్కాబ్ వజ్రోత్సవాల్లో పాలక వర్గ సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, వెంకట రమణారెడ్డి, మూలింటి రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఇంతవరకు పింఛన్లు పొందని వారు శనివారం సంబంధిత వార్డు, గ్రామ వలంటీరు ద్వారా తీసుకోవచ్చని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నాగశివలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 2,36,089 మంది లబ్ధిదారులు ఉండగా శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి 2,31,960 మందికి (98.25శాతం), నంద్యాల జిల్లాలో 2,13,642 మంది లబ్ధిదారులు ఉండగా 2,09,843 (98.22 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 5, నంద్యాల జిల్లా 7వ స్థానంలో నిలిచాయి.

వ్యవ‘సాయానికి’ డ్రోనులు

- మొదటి విడతగా జిల్లాకు 20 మంజూరు
- పైలట్ శిక్షణ పూర్తి చేసుకున్న 13 మంది
- రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌పై 50 శాతం రాయితీ
- అధునాతన పద్ధతిలో ఎరువులు, పురుగుమందు పిచికారీ



డ్రోన్‌తో మందు పిచికారీ (ఫైల్)

నంద్యాల(సెంట్రల్): సాగులో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ఎరువులు, పురుగు మందుల పిచికారీలో సంప్రదాయ విధానాలతో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గించి, సమయం, ఎరువులు, పురుగుమందులు వృథా కాకుండా 'కిసాన్ డ్రోన్ల'ను అందుబాటులోకి తెస్తోంది. జిల్లా వ్యాప్తంగా 411 రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లు ఉన్నాయి. వీటి పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేసి రైతు గ్రూపులకు 40 శాతం రాయితీపై కోరుకున్న ట్రాక్టర్లు, ఇతరత్రా ఆధునిక యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. అనుబంధంగా మల్టీపర్పస్ స్పెషాలిటీ సెంటర్ల పేరుతో గోదాముల నిర్మాణం చేపడుతోంది. తాజాగా వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎరువులు, పురుగుమందుల పిచికారీకి బాగా ఉపయోగపడే 'డ్రోన్లు' అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయ పద్ధతుల్లో ఇక నుంచి కిసాన్ డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయి.

అక్టోబర్ నుంచి అందుబాటులోకి..

తొలి విడతగా జిల్లాకు 20 డ్రోన్లు మంజూరయ్యాయి. మలివిడతలో అవసరం మేరకు అదనపు కేటాయింపులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. వీటిని కూడా ఆర్‌బీకేలకు అనుబంధంగా సీహెచ్‌సీల పరిధిలోకి తీసుకురానున్నారు. ఒక డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలుగా నిర్ణయించారు. పదో తరగతి, ఇంటర్ చదివిన రైతులకు 40 శాతం, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు పూర్తయిన వారికి 50 శాతం రాయితీ కల్పిస్తూ.. మిగిలినది బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారు. తొలి విడతగా అక్టోబర్ నాటికి 20 డ్రోన్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. డ్రోన్ నిర్వహణకు ఎంపిక చేసిన రైతులకు విమాన పైలెట్ల మాదిరిగా సమగ్ర వివరాలతో పాస్‌పోర్టు చేయించి అమరావతిలో 12 రోజుల పాటు ఉచితంగా పైలెట్ శిక్షణ ఇస్తున్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటికే 13 మందికి శిక్షణ పూర్తి చేశారు. నలుగురు ప్రస్తుతం శిక్షణ తీసుకుంటుండగా, మరొకరు ఈ నెల 15వ తేదీన వెళ్లనున్నారు. అక్టోబర్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ల వినియోగాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీంతో మొదటి విడత జిల్లాలో పాములపాడు, ఆత్మకూరు, రుద్రవరం, జూపాడుబంగ్లా, శిరివెళ్ల, నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, నంద్యాల, అవుకు, ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, దొర్నిపాడు, బనగానపల్లె, మహానంది, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల, వెలుగోడు మండలాల రైతులకు డ్రోన్‌సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

- జలశక్తి ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ అక్షయ్‌కుమార్ సాహూ



ప్రాజెక్ట్ వద్ద జలహారతి పూజల్లో పాల్గొన్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: మానవ మనగడకు నీరు ఎంతో అవసరమని, నీటి వనరులను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని జలశక్తి ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ అక్షయ్ కుమార్ సాహూ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వెలుగులు నింపుతున్న శ్రీశైలంప్రాజెక్ట్ నిర్మాణానికి పునాది వేసి 60 వసంతాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో సెంట్రల్ వాటర్ కమిషన్ చీఫ్ సభ్యులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, డ్యామ్ ఇంజినీర్లు, సిబ్బంది ర్యాలీగా ప్రాజెక్ట్ వ్యూ పాయింట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ సేవ్ వాటర్ పేరుతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జలశక్తి ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ అక్షయ్‌కుమార్ సాహూతో పాటు ఇతర అధికారులు మాట్లాడారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జలవనరులు పుష్కలంగా ఉన్న చోట వ్యవసాయం, పరిశ్రమలు వృద్ధి చెందుతాయన్నారు.. అనంతరం కృష్ణమ్మ జల హారతి ఇచ్చారు. కార్యక్రమంలో సెంట్రల్ వాటర్ కమిషన్ చీఫ్ ఇంజినీర్ రంగారెడ్డి, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారి తంగముణి, హైడ్రాలజీ చీఫ్ ఇంజినీర్ టీవీఎస్ఆర్.కుమార్, సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సీఈ కబీర్‌బాషా, ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ ఎస్‌ఈ గంగాధర్‌రెడ్డి, ఈఈలు మనోహర్ రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రావణమాస వేడుకలకు అన్ని సౌకర్యాలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో నిర్వహించే శ్రావణ మాస వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం దేవాలయ ఆవరణలోని డార్మెటరీ హాల్‌లో ఉత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం దేవాలయం తర్వాత ఈరన్నస్వామి ఆలయంలో శ్రావణమాసం ఉత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఈనెల 17న ప్రారంభమయ్యే ఉత్సవాలు సెప్టెంబర్ 14వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి మాట్లాడుతూ..ఉత్సవాల్లో 15 లక్షల నుంచి 20 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. భక్తుల సౌర్యార్థం మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వేదభూమిలో రామ జపం



రామ నామ జపం చేస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం: వేద భూమి అయిన మంత్రాలయంలో శుక్రవారం రామ నామ కోటి జపం వైభవంగా జరిగింది. శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఆశీస్సులతో 6 గంటల పాటు జప కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ డివైన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 400 మందితో పారాయణం చేశారు. ముందుగా రాఘవేంద్రుల మూల బృందావనానికి పీఠాధిపతి విశేష పూజలు చేశారు. ఊంజల మంటపంలో రాయరు ప్రతిమకు పూజలు చేపట్టి రామ నామ జపానికి అంకురార్పణ పలికారు. రామ నామ జప కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి ఆ సంస్థ ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి పీఠాధిపతిని ప్రత్యేక వాహనంపై శ్రీమఠం వరకు ఊరేగించారు. యోగీంద్ర మంటపంలో పీఠాధిపతికి ముత్యాల అభిషేకం నిర్వహించి గ్రంథాలతో తులాభారం చేశారు. తమిళనాడుకు చెందిన సుప్పయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకలో మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్-1 శ్రీనివాస రావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, పండితులు , తమిళనాడు భక్తులు పాల్గొన్నారు.

ఆరిపోయిన ఆశల దీపం

- బొలేరో వాహనం ఢీకొని బాలుడి మృతి



ధనుష్(ఫైల్)

నందవరం: ఆ ఇంట బోసి నవ్వులు మూగబోయాయి. అనుకోని దుర్ఘటనతో ఆశల దీపం ఆరిపోయింది. ఇంటిల్లిపాదిని తీరని శోకంలో ముంచింది. నందవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన బెస్త మల్లికార్జునకు ఇద్దరు కుమారులు కాగా.. పెద్ద కుమారుడికి ఇద్దరూ కుమార్తెలే. చిన్న కుమారుడికి ఒక కుమార్తె, ఒక కుమారు ధనుష్ ఉన్నారు. వంశాకురం అని రెండున్నరేళ్ల ధనుష్‌ను అల్లారుముద్దుగా పెంచుకున్నారు. శుక్రవారం ఉదయం ధనుష్ తాత మల్లికార్జున ఇంటి ముందున్న బొలెరో వాహనాన్ని పక్కకు తీస్తుండగా ఆయన వెనకలే మనవడు వెళ్లాడు. అయితే చూసుకోని తాత రివర్స్‌లో వాహనాన్ని తీస్తుడంగా ధనుష్ టైర్ కింద పోడిపోయాడు. బాలుడిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఒక్కగానొక్క కుమారుడు అనుకోకుండా మృతువాత పడడంతో తల్లిదండ్రులు మురళీకృష్ణ, చంద్రకళ బోరున విలపించారు.



క్లుప్తంగా

11న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ నెల 11వ తేదీన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య, వైద్యం, 2.30 గంటలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని కోరారు.

బీసీ వసతి గృహాల నిర్వహణపై నేడు వర్క్‌షాప్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని బీసీ వసతి గృహాల నిర్వహణకు సంబంధించి వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లోని సమావేశ హాల్‌లో నిర్వహించే వర్క్‌షాప్‌కు జిల్లాలోని ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ బీసీ వసతి గృహాలకు చెందిన సంక్షేమాధికారులు, సహాయ బీసీ సంక్షేమాధికారులు హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహించిన అనంతరం డివిజన్ స్థాయిల్లో కూడా నాల్గవ తరగతి సిబ్బందితో కలిసి నిర్వహిస్తామని చెప్పారు. సహాయ బీసీ సంక్షేమాధికారులు విధిగా హాస్టళ్లను తనిఖీ చేసి నివేదికలను తమకు అందించాల్సి ఉందన్నారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): యూపీఎస్సీ సివిల్స్, గ్రూప్-1, 2 రెసిడెన్షియల్ ఫ్రీ కోచింగ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి ఎం.చింతామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి బ్రాంచ్‌లో కోచింగ్‌కు నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, ఇతర వర్గాల పట్టభద్రులు ఆన్‌లైన్‌లో ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సివిల్ సర్వీసెస్ యూపీఎస్సీ విశాఖపట్నం కోచింగ్ సెంటర్, గ్రూప్-1 విజయవాడ, గ్రూప్-2 తిరుపతిలో కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. కుటుంబ ఆదాయం రూ.6 లక్షలు మించరాదన్నారు. పూర్తి వివరాల కోసం apstdc.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

'లా' ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2023లో జరిగిన ఎల్ఎల్‌బీ (లా) 2, 4, 6, 8, 10 రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు శుక్రవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. పరీక్ష ఫలితాలను కోస విద్యార్థులు WWW.RUK.AC.IN/ RESULTSలో చూసుకోవాలని సూచించారు.

సొంత వాహనాల్లో ప్రజా రవాణా!

- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- కర్నూలు చౌరస్తా కేంద్రంగా దందా
- కూతవేటు దూరంలో స్టేషన్ ఉన్నా పట్టించుకోని పోలీసులు
- నిత్యం ట్రాఫిక్ రద్దీతో సతమతమవుతున్న వాహనదారులు



కర్నూలులోని బళ్లారి చౌరస్తాలో ట్యాక్సీల ముసుగులో ప్రయాణికుల రవాణాకు సిద్ధంగా ఉన్న వ్యక్తిగత వాహనాలు

కర్నూలు : పేరుకు అవి వ్యక్తిగత (కార్లు) వాహనాలు. కానీ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణికులను చేరవేస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా ఇలా ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలు ప్రమాదానికి గురైతే ప్రయాణికుల భద్రత గాలిలో దీపమేనంటున్నారు రవాణా శాఖ అధికారులు. వ్యక్తిగత వాహనాలకు పర్మిట్, ఫిట్‌నెస్ అవసరం లేదు. కానీ రవాణా వాహనాలకు ఈ రెండూ తప్పనిసరి. పర్మిట్, ట్యాక్స్‌లు కలిపి రూ.10 వేలు, ఫిట్‌నెస్ ఫీజు రూ.700 చొప్పున రవాణా శాఖకు చెల్లించాలి. ఒక్కో సీటుకు కొంత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సీటింగ్ కెపాసిటీని బట్టి ఈ పన్ను మారుతుంది. ఇది ఒక వాహనానికి మూడు నెలలకు దాదాపు రూ.7 వేల వరకు ఉంటుంది. ఇక వ్యక్తిగత వాహనాలకు, రవాణా వాహనాలకు రెండింటికీ ఇన్సూరెన్స్ ఉండాలి. రవాణా వాహనాలకు తప్పనిసరిగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉండాలి. వ్యక్తిగత కార్లలో ప్రయాణికులను చేరవేస్తున్నట్లు రవాణా పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఉల్లంఘించి...

కర్నూలు నగరం బళ్లారి చౌరస్తాను అడ్డాగా చేసుకుని వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తున్నారు. రోజుకు సుమారు 70 నుంచి 100 దాకా వ్యక్తిగత వాహనాల్లో కర్నూలు నుంచి హైదరాబాదు వరకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా తిప్పుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాంతం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ట్యాక్సీల ముసుగులో రోడ్డుపైనే ప్రత్యేక స్టాండ్ ఏర్పాటు చేసి వాహనాలు పార్క్ చేస్తుండటంతో రాకపోకలు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వాదాయానికి భారీగా నష్టం

కర్నూలు నగరం నుంచి హైదరాబాద్ వరకు వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను చేరవేస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్కొక్క వాహనంలో ఐదు నుంచి పది మందిని తీసుకెళ్తున్నారు. ఆర్టీసీ బస్సులో ఒక్కొక్కరికి చార్జీ రూ.400 అవుతుంది. అయితే ప్రైవేటు వాహనదారులు రూ.350 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నారు. త్వరగా వెళ్లాలనే ఉద్దేశంతో చాలామంది ప్రయాణికులు వీటిపైనే మొగ్గుచూపుతున్నారు.

ప్రమాదం జరిగిందో...

వ్యక్తిగత వాహనాలు ప్రమాదానికి గురైతే అందులోని ప్రయాణికులకు ఇన్సూరెన్స్ రాదు. పర్మిట్, ఫిట్‌నెస్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఉంటేనే ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. వ్యక్తిగత వాహనాలకు ఇవేవీ ఉండవు. ఒకవేళ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతే ఆయా కుటుంబాలు రోడ్డున పడాల్సిందే. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్నప్పటికీ రవాణా, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూతవేటు దూరంలోనే పోలీసు స్టేషన్ ఉన్నప్పటికీ ప్రైవేటు వాహనదారులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించేందుకు ఇద్దరు వ్యక్తులకు జీతాలు ఇచ్చి ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను చేరవేయడం నిబంధనలకు విరుద్ధం. ఇలాంటి వాహనాలు దొరికితే స్వాధీనం చేసుకుంటాం. ప్రయాణికుల భద్రతే ముఖ్యం. వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళ్తూ ప్రమాదానికి గురైతే ఇన్సూరెన్స్ రాదు. బాధిత కుటుంబాలు ఇబ్బంది పడకూడదనే రవాణా శాఖ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానిదే పూర్తి బాధ్యత. రవాణా శాఖ ఆదాయానికి గండి కొట్టినా పన్నులు చెల్లించకుండా వాహనాలు తిప్పినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– రమేష్, ఆర్‌టీఓ

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: యువతీ, యువకులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఫెర్రర్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి వి, శ్రీకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకున్న యువతీ, యువకులు ఖాళీగా ఉండకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వెతుక్కోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉద్యోగమేళాలను నిర్వహిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలూరు నియోజకవర్గంలో విద్యార్థుల కోసం 2008లోనే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ పాలిటెక్నికల్, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 11 రకాల కంపెనీల ప్రతినిధులు 820 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. యువతీ, యువకులు తల్లిదండ్రులకు భారం కాకుండా నచ్చిన ఉద్యోగంలో చేరి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చిన వారికి మంత్రి భోజన వసతిని ఏర్పాటు చేశారు. నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ నారాయణస్వామి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారిణి దీప్తి, మండల కన్వీనర్ వీరేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంభీమ్ నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కో-కన్వీనర్ హనుమయ్య, ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాదు పాల్గొన్నారు.



ఉద్యోగ మేళాకు హాజరైన యువతీ, యువకులు

పార్లమెంట్‌లో మూడు బిల్లులు ప్రవేశపెట్టిన కర్నూలు ఎంపీ



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ వివిధ అంశాలకు సంబంధించిన మూడు బిల్లులను శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఇండియన్ మెడికల్ సర్వీస్‌ను ప్రారంభించాలని ప్రతిపాదించారు. దీంతో కోవిడ్ లాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని. జిల్లా దివ్యాంగుల పునరావాస కమిటీలు (డీడీఆర్‌సీ) ఏర్పాటు చేయడం కోసం దివ్యాంగుల హక్కుల (సవరణ) బిల్లు-2023ను ప్రవేశ పెట్టారు. ది హ్యాండ్లూమ్ వీవర్స్ అండ్ వర్కర్స్ (వెల్ఫేర్) అథారిటీ బిల్లు-2022ను ప్రవేశపెట్టి.. ఎంపీ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 35,22,512 మంది చేనేత కార్మికులు ఉన్నారని, చేనేత రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, సామాజిక భద్రత లేకపోవడం, ఎక్కువ గంటల పని, తక్కువ వేతనాలు, మార్కెట్‌లో గుర్తింపు లేకపోడం.. తదితర సమస్యలకు ఈ బిల్లు ద్వారా పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. గతంలో ఒకే రోజు మూడు బిల్లులు ప్రవేశపెట్టానని, తాజాగా మళ్లీ అవకాశం లభించిందని ఆయన 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత

- వ్యాపారి, లారీడ్రైవర్, యజమానిపై కేసు నమోదు



విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం లారీ

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో 319 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. ప్రభుత్వం కార్డుదారులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని సేకరించి కొంతమంది దళారులు పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాంతీయ అధికారి నీలం పూజిత ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కల్లూరు రిచ్‌మండ్ హోమ్ కాలనీ నుంచి వక్కిలేరు వాగుకు వెళ్లే దారిలో రేకుల షెడ్డు వద్ద అక్రమంగా బియ్యం తరలిస్తున్న ఏపీ21 టీబీ 6867 లారీని పట్టుకున్నారు. అందులో తనిఖీ చేయగా 638 బస్తాల్లో 319 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. వాటిని స్వాధీనం చేసుకుని కర్నూలు ఎమ్మెల్యేస్ పాయింట్‌లో అప్పగించారు. బియ్యంతో పట్టుబడిన లారీని నాల్గవ పట్టణ పోలీసులకు అప్పగించారు. పీడీఎస్ బియ్యం వ్యాపారి ఎరుకలి నరసింహులు, లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లు, లారీ యజమాని పింజరి మౌలాలిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు యాదవ్, ఎస్‌ఐ హనుమంతయ్య, తహసీల్దార్ వెంకటనారాయణ, ఆర్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ సూర్యనారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 29 నుంచి ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ రిఫ్రెషర్ శిక్షణను ఇస్తున్నట్లు జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించి స్థానిక జిల్లాపరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనాన్ని శుక్రవారం శ్రీకాళహస్తి నుంచి వచ్చిన జిల్లా పరిశీలకులు వెంకటరత్నంతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం తమ చాంబర్‌లో జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వి.వి.సుబ్బారెడ్డితో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పరిపాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాల్లో ఏయే తేదీల్లో ఏయే మండలాలకు సంబంధించిన కార్యదర్శులను ఎంతమందిని శిక్షణకు ఆహ్వానించాలనే అంశంపై సంబంధిత అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో డీపీఆర్‌సీ సిబ్బంది గిడ్డేష్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై మూడు నెలల శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): నిరుద్యోగ యువతకు చేపల పెంపకం, పట్టడం, మార్కెటింగ్ తదితర అంశాలపై మూడు నెలల శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ మత్స్య శిక్షణ కేంద్రంలో(ఐఎఫ్‌టీసీ)లో శిక్షణ కార్యక్రమం సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకు జరుగుతుందని, ఆసక్తి కలిగిన యువత ఈ నెల 30వ తేదీలోపు కర్నూలు బంగారుపేటలోని మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా మత్స్యరంగం ద్వారా స్వయం ఉపాధిలో రాణించే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 31న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని షణ్ముఖప్రియ అదృశ్యమైనట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. నంద్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గురువారం కళాశాలకు వెళ్లిన ఆమె ఆరోగ్యం బాలేదని ఇంటికి వచ్చింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబీకులు అంతటా గాలించారు. బంధువుల ఇళ్లలో ఆరా తీసిన ఆచూకీ లేకపోవడంతో విద్యార్థిని తండ్రి జమాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కర్నూలులో ఆర్‌ఏఎఫ్ కవాతు



ఆర్‌ఏఎఫ్ పోలీసులు కవాతు చేస్తున్న దృశ్యం

కర్నూలు : ప్రజల్లో భయాందోళన పోగొట్టేందుకు హైదరాబాద్ హకీంపేటలోని 99వ బి బెటాలియన్‌కు చెందిన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) శుక్రవారం ఉదయం నగరంలో కవాతు నిర్వహించింది. ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టి.పి.బఘేల్ ఆధ్వర్యంలో రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండారెడ్డిబురుజు నుంచి రాజ్‌విహార్, మౌర్య ఇన్, ఫైవ్‌రోడ్ జంక్షన్ మీదుగా తిరిగి కొండారెడ్డిబురుజు వరకు, సాయంత్రం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతబస్తీ, కింగ్ మార్కెట్, మండిబజార్, పూల మార్కెట్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. నేరాల కట్టడికి స్థానిక పోలీసులు ఉన్నప్పటికీ అల్లర్లు, సంఘ విద్రోహ చర్యలు, మత కల్లోలాలు వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించారు. సుమారు 60 మంది ఆర్‌ఏఎఫ్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు కూడా ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు.

నేడు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఐఈఆర్‌పీ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఎమ్‌ఆర్‌టీ), మండల అకౌంటెంట్లు, ఎమ్ఐఎస్ కో ర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్/ ఆఫీస్ సబార్డినేట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు శనివారం ఉదయం 10 గంటలకు సమగ్ర శిక్ష అడిషనల్‌ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమావేశ మందిరంలో బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందని సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

గ్రామీణ మహిళలకు ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంబ్రాయిడరీ(జర్దోసి మగ్గం) ఫాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమం ఈ నెల 17న మొదలై 30 రోజుల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలని, చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లను జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన మూడో అంతస్తులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 63044 91236 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

సెప్టెంబర్ 18న వినాయక చవితి

కర్నూలు కల్చరల్: వినాయక చవితి పర్వదినం సెప్టెంబర్ 18వ తేదీనే జరుపుకోవాలని పండితులు ఎం.నాగఫణి శాస్త్రి తెలిపారు. ఈ సంవత్సరం బాధ్రపద మాసంలో చవితి రెండు రోజులు ఉన్నందున వినాయక చవితి ఏరోజు జరుపుకోవాలనే సందేహం ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 18వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటల వరకు అనంతరం చవితి మధ్యాహ్న వ్యాప్తితో సోమవారం పూర్తిగా ఉండి మంగళవారం 19వ తేదీ 12 గంటలకంతా పూర్తి అవుతుందని తెలిపారు. సాధారణంగా తిథి నియమం ప్రకారం సూర్యోదయానికి ఉన్న తిథినే ఆ రోజంతా పరిగణించాలని తెలిపారు. పండుగలు, విశేష పర్వదినాలలో ధర్మ సింధు లాంటి గ్రంథాల్లో కొన్ని ప్రత్యేక నియమాలు తెలిపారని పేర్కొన్నారు. ఈ రకంగా వినాయక చవితి పండుగను మధ్యాహ్న వ్యాప్తి ఉన్న చవితి నాడే ఆచరించాల్సి ఉందని తెలిపారు. సెప్టెంబర్ 18వ తేదీనే వినాయక చవితి ఆచరించటం శ్రేయోదాయకమని పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు బయోమెట్రిక్ అథెంటికేషన్

కర్నూలు(అర్బన్) : 2022-23 కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరు కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాఠశాల/కళాశాలల అధికారులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరిగా చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి/నోడల్ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల బయోమెట్రిక్ అథెంటికేషన్ కోసం ఈనెల 5న ఉదయం 10 గంటలకు ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఆత్మకూరు, కొత్తపల్లి, వెలుగోడు, పాములపా డు, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల మండలాల్లోని పాఠశాలలు/కళాశాలల అధికారులు వారి ఆ ధార్ కార్డు లింక్ సెల్ నెంబర్, ఎన్ఎస్‌పీ యూజర్ ఐ డీ, పాస్‌వర్డ్ తీసుకుని ఆధార్ అథెంటికేషన్ చేయించు కోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 9885488088, 9848864449లో సంప్రదించాలన్నారు.

సీనియర్ రెసిడెంట్లకు 7న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కర్నూలు(హాస్పిటల్): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు కర్నూలు మెడికల్ కాలేజిలో ఖాళీగా ఉన్న 71 సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఈ నెల 7న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కళాశాలలోని కౌన్సిల్ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్ 4, గైనకాలజీ 1, రేడియాలజీ 3, ఎమర్జెన్సీ మెడిసిన్ 9, రేడియోథెరపీ 1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 1, అనాటమీ 6, ఫిజియాలజీ 4, బయోకెమిస్ట్రీ 4, ఫార్మకాలజీ 6, పాథాలజీ 5, మైక్రోబయాలజీ 4, ఫోరెన్సిక్ మెడిసిన్ 4, కమ్యూనిటీ మెడిసిన్ 6, కార్డియాలజీ 1, ఎండోక్రైనాలజీ 1, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 1, న్యూరాలజీ 1, సీటీవీఎస్ 1, ప్లాస్టిక్ సర్జరీ 1, పీడియాట్రిక్ సర్జరీ 1, యురాలజీ 1, న్యూరోసర్జరీ 1, నెఫ్రాలజీ 1, సర్జికల్ ఆంకాలజీ 1, మెడికల్ ఆంకాలజీ 1, జనరల్ సర్జరీ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజిలో పీజీ చదివిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇతర జిల్లాల వారికి రెండో ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.పూర్తివివరాలకు www. kurnoolmedicalcollege.ac.in ను వీక్షించాలని సూచించారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశనగ	4,529	8,319
పొద్దుతిరుగుడు	4,369	4,369
ఆముదం	5,827	6,040
వాము	7,589	26,666
ఉల్లి	1,079	1,129
కందులు	9,374	9,574
మొక్కజొన్న	2,009	2,009
మినుములు	7,811	7,861
సోయా చిక్కుడు	4,155	4,155

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ Regular/Distance / Discontinued/Direct final year : 10th, 12th Diploma, B.Tech, M. Tech, B.A., B.Com, B.Sc., M.A., M.Com, M.Sc, BSW, BLIC, BBA, BCA, LLB, MLT, DMLT, ANATISHA, OT, MPHW, ANM, GNM, MBA, MCA, AGBSC, PHD, Kurnool. Cell: 8686172989 [L-787260]

పాలిటెక్నిక్ అడ్మిషన్స్

■ AP పాలిసెట్ లో ర్యాంక్స్ సాధించిన స్టూడెంట్స్ కి పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఫ్రీ ఎడ్యుకేషన్, ఫ్రీ హాస్టల్ కలదు Cont : G. MURALI - 9030661651. [A-2597]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1902]

REAL ESTATE

■ నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గరలో 36.50 లక్షలలో 2BHK Flat & గణేష్‌నగర్‌లో ఫ్లాట్ 23.90 లక్షలు మొదలు & సాయికృష్ణ డిగ్రీ కాలేజ్ దగ్గర ఓపెన్ ప్లాట్ 22 లక్షలు సేల్ కలదు. 90145 80500 [L-787400]

■ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు వెంచర్ల కోసం ప్రముఖ సంస్థకు తక్షణం కావలెను. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తక్షణం సంప్ర : 9948801112 [HA-30034]

PLOT FOR SALE

■ ప్లాట్లు, ప్లాట్లు, ప్లాట్లు ప్రకృతి రియల్ ఎస్టేట్ న్యూ వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ కలవు. అతి తక్కువ ధరలకే అమ్మబడును. స్పాట్ రిజిస్ట్రేషన్. 100% టైటిల్ క్లియర్. సెల్: 94401 58901 [L-787399]

FLAT FOR SALE

■ Kuda Approval తో గణేష్‌నగర్‌లో పద్మాస్ రెసిడెన్సీ & నంద్యాల చెక్‌పోస్ట్ నేహా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌లో 2BHK Flats, పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ మెయిన్ రోడ్డుకి లగ్జరీ 3BHK & Duplex Villas అమ్మకానికి కలవు. 90143 35313 [L-787401]

HOUSE FOR SALE

■ బాలాజీ నగర్‌లో ఉత్తరం 54x60లో 2 షాపులు, 3 కార్ల పార్కింగ్‌తో హోమ్ థియేటర్ పెట్టుకోగల 25 అ॥ల హాలుతో 10 రూముల ఇల్లు అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్ – 89198 68887 [L-787395]

■ APOORVA BUILDERS. Premium ready to move in houses with interiors in gated community Bank Loan Available. Cell: 81215 87551 [L-787364]

■ కర్నూలు–బిర్లాగేట్ దగ్గరలో స్కంద ఆఫీస్ వెనుక ఎండోమెంట్ కాలనీలో తూర్పు ఫేస్ 5 1/2 సెంట్లలో 2 ఫ్లోర్స్ మరియు వాచ్‌మెన్ రూం గల Approved LP No. House అమ్మకానికి కలదు. Fixed Rate 1.20 Crores. సంప్ర: 79955 44946 [L-787402]

■ కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌కు, రైల్వే స్టేషన్‌కి సమీపంలో వాటర్ పంప్ హౌస్ దగ్గర, సీతారామనగర్ నందు 622.22 Sq. Yards కల్గిన స్థలంలో నిర్మించిన డూప్లెక్స్ హౌస్ అమ్మకమునకు కలదు. సంప్ర: 99853 26786 [L-691]

TO - LET

■ కర్నూలు నందు సంతోష్ నగర్ హైవే రోడ్డుకు 500 మీటర్స్ దగ్గరలో 11,000 sft గల రెండు గోడౌన్లు కాంపౌండ్ వాల్‌తో సహా అద్దెకి కలదు. సంప్ర: 88867 91111 [L-787393]

SERVICES

FOR SALE

■ కర్నూలు – బిర్లా కాంపౌండ్, జగదీష్‌మాల్‌లో మంచి కౌంటర్ ఉన్న హోటల్ అమ్మబడును. రన్నింగ్ హోటల్. సంప్ర: 91771 77289 [L-787397]

ASTROLOGY

■ శ్రీ వైదీశ్వరన్ కోవిల్ నాడీ జ్యోతిష్యాలయం. మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. పాతబస్టాండ్, కర్నూలు. 83092 09485. [L-787262]

BUSINESS OFFER

■ ఆర్థిక సలహాలు, సూచనలు మరియు సహాయం ఇవ్వబడును. సిబిల్ స్కోర్ టేకోవర్, మార్టిగేజ్ సంబంధించి సంప్ర॥7997441253. [C-777152]

HAPPY CARS

■ Do you have a car? Why to make it stand still at home. HAPYCAR is now at Kurnool & Nandyal Attach your car with HAPYCAR and start earning upto 32000/- per month For more info call 6301174565, 7893887729 [C-777154]

MARRIAGE SERVICES

■ స్టార్ ముస్లిం మ్యారేజ్ బ్యూరో నంద్యాల బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రైవేటు, టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, ఆర్మీ, డాక్టర్ సంబంధాలు కలవు. సంప్ర: 87908 44959 (2వ సంబంధాలు కలవు) [L-787391]

WANTED

■ కర్నూలు సిటీలో గల ప్రముఖ ఫర్టిలిటీ క్లినిక్‌లో పనిచేయుటకు లేడి ఫ్రంట్ ఆఫీస్ రిసెప్షనిస్టులు కావలెను. (ఇంటర్/డిగ్రీ) ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వెంటనే సంప్ర: 83419 57788 [L-787262]

■ Wanted Teachers for Only Social Part Time/ Full Time. Contact: Sri Medha Vidyalaya, Kurnool. Cell: 94928 51956, 70139 45358 [L-787264]

■ క్లీనింగ్ సర్వీసెస్ నందు పనిచేయుటకు నెల జీతానికి వర్కర్స్ కావలెను. హౌస్, సంప్, బాత్రూం, టాయిలెట్స్, సింటెక్స్ ట్యాంక్ క్లీనింగ్ మొదలగునవి. 2 వీలర్ ఖచ్చితంగా ఉండాలి. శాలరీ+ ట్రావెలింగ్ అలవెన్స్ కలవు. సంప్ర: 98858 82404 [L-787265]

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221503]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 9848669434 [G-786476]

■ ఆంధ్రప్రదేశ్‌లో న్యూ బ్రాంచ్ ఆఫీస్‌లో గ్లోబల్ గా వర్క్ చేయుటకు టీమ్ లీడర్స్, రిటైర్డ్ గృహిణులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు అర్జంటు జాబ్స్. P/T: 18500, F/T: 23500. 9844583004 [G-786524]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/–. ఫోన్ : 72074 45296 [V-6204]

■ TIK pvt Ltd లో వర్క్ చేయుటకు M/F కావలెను. అర్హత: 10th- Any Qualification, P/F Time. Sal: 13k to 18k, Age: 18-30below. 9384958382 [G-863]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సు లు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-473]

■ నందికొట్కూరులో ప్ర॥ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్సు కావలెను. జీ॥ 12 to 15 వేలు. రూం + భోజన వసతి. రాజ్ సెక్యూరిటీ, రాజమండ్రి – ✆ : 80083 70359 & 93922 69369 [R-70]

■ జాబ్ గ్యారెంటీ మా కంపెనీ కొరకు మహిళలు వెంటనే కావలెను. ఫ్రీ రూమ్+ భోజనం +జీతం: 15–30వేల వరకు, (ఏజెంట్స్‌కి 5000 కమీషన్) ఫోన్ : 7799087387 [H-788930]

■ Urgently Required Plumber, Electrician, Cooking Master, House Keeping Boys and Telecallers for Hotel Ph: 8309909633, 8637338326, 7893174029 [HA-481]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రాక్టర్స్ కావలెను. జీ: 12000 - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph : 8919613984. [HA-477]

■ JOB VACANCY: TIK PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 8074612837. [T-774222]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
94909 94349
94412 10725